09ATP27_09ATP27.qxd 28-06-2024 PM 10:13 Page 1






# బెంగళూరు నమ్మమెట్రో విస్తరణకు 15వేలకోట్ల సాయం ఇవ్వండి

## - కేంద్ర మంత్రికి సిఎం మనవి

**బెంగళూరు,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**



కేంద్ర ఉపరితల రవాణా జాతీయరహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరికి మనవి పత్రం సమర్పిస్తున్న సిఎం సిద్ధరామయ్య తదితరులు.

కర్ణాటక సర్కారు గతంలో పెట్టుకున్న కేంద్రసాయం మనవి పత్రాలకు వెంటనే అనుమతులు ఇప్పించి సాయం ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో కర్ణాటకకు చెందిన పార్లమెంట్ సభ్యులతోను కర్ణాటకకు చెందిన కేంద్ర మంత్రులతో సమావేశమైన తరువాత కేంద్రానికి వినతులు అందించారు. అంతకుముందు ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరితో సమావేశమైన సిఎం సిద్ధరామయ్య తదితరులు కర్ణాటకలోని పలు పెండింగు ప్రాజెక్టులకు కేంద్రసర్కారు ఉదారంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి, మరియు కర్ణాటక సిఎం సంయుక్తంగా పాల్గొన్నారు. బెంగళూరు నగరంలో నమ్మ మెట్రో 3వ ఫేజు విస్తరణ పనులకు కేంద్రం వెంటనే 15611కోట్ల రూపాయలను మంజూరు చేయాలని కోరారు. బెంగళూరులో చెరువుల బాగు చేసేందుకు గతంలో కేంద్రబడ్జెట్‌లో ప్రకటించిన 3వేల కోట్ల రూపాయల సాయాన్ని విడుదల చేయాలి. అప్పర్ భద్ర ప్రాజెక్టు విస్తరణ పనులకు 5వేల కోట్ల రూపాయలను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు ఆసాయాన్ని కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు బెంగళూరుకు స్పెషల్‌గ్రాంట్ కింద 5వేలకోట్ల రూపాయలను మంజూరు చేసే ప్రాజెక్టు పెండింగులో ఉంది. దీనికి కూడా అనుమతిఇవ్వాలని మనవి చేశారు. రాయచూరులో ఎయిమ్స్ శాఖను కేటాయించి అభివృద్ధి చేయాలి. కర్ణాటక కోస్తా జిల్లాలోలని బందర్లలో సముద్రంపైన విమాన విహారయాత్రలకు కేంద్రం సాయం ఇవ్వాలి. మల్పె, బైందూరు, మంగళూరు కాళీ నదుల్లో సీప్లేన్ విహారయాత్ర టూరిజంకు సాయం అందించాలి. శిరాడీఘాట్‌లో 30కిలోమీటర్ల వరకు రెండువైపుల రహదారులను విస్తరించే 2580కోట్ల ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చి ఆర్థికసాయం అందించాలని మనవి చేశారు. సిఎం వెంట ఉపముఖ్యమంత్రి డికె. శివ కుమార్, హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర ఢిల్లీలో కర్ణాటక ప్రతినిది టి.బి. జయచంద్ర , కెజె . జార్జి, సతీష్‌జారకిహొళి తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో ఘోరరోడ్డు ప్రమాదంలో 13మంది మృతి

లారీని ఢీకొట్టిన టెంపోట్రాక్స్ వాహనం



**హావేరి,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో శుక్రవారం వేకువ జామున నాలుగోనెంబర్ జాతీయరహదారిలో హావేరి జిల్లా బ్యాడగి తాలూకా గుండనహళ్లి గ్రామం వద్ద సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13మంది మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా ఎమ్మెహట్టి గ్రామానికి చెందిన 17మంది భక్తుల బృందం కలబురగి జిల్లా చింఛోళి తాలూకాలోని మాయమ్మ దేవతను దర్శించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా హావేరి జిల్లా బ్యాడగి తాలూకాలో వీరు ప్రయాణిస్తున్న టెంపోట్రాక్స్ వాహనం రోడ్డుపక్కన అగిఉన్న లారీను ఢీకొట్టడంతో కొద్దిసేపట్లోనే 13మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో టెంపో డ్రయివరు ఆదర్శ(23) మరియు పరశురామ, నాగ, బాగ్యశ్రీ, మానస, మంజుళా, పుణ్యాభాయి, అర్పితా, రూపా, విశాలాక్షి, సుభద్రబాయి, తదితరులు ఉన్నారు. కాగా ఈప్రమాదంలో టెంపోట్రాక్స్ వాహనం నజ్జునజ్జయిపోయింది .ప్రమాదం జరిగినచోటు వేకువజాము కావటంతో పరిహార చర్యలకు కాస్తంత జాప్యంకలిగింది. ప్రమాదం చోటుకు హావేరి జిల్లా ఎస్పి అన్షుకుమార్ హాజరై పరిశీలించారు. ఈ ప్రమాదంలో మృతి చెందినవారికి కల్బుర్గి జిల్లా ఇంఛార్జీ మంత్రి ప్రియాంక్ ఖర్గే తలా 50వేల రూపాయలల ఆర్థిక సాయం ప్రకటించారు.

# మానుంచి అక్రమంగా బీర్ స్వాధీనం చేసుకున్నారు

## - సర్కారుపైన కేసు పెట్టిన యుబి కంపెనీ

**చామరాజనగర,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో చామరాజనగరలో అక్రమంగా మద్యం సరఫరా అవుతుందన్న ఆరోపణలపైన యుబి కంపెనీకు బీర్ కంపెనీపైన ఎక్సైజ్ శాఖ అధికారులు అన్యాయంగా దాడులు చేసి 8కోట్ల రూపాయల మద్యాన్ని సీజ్‌చేశారు. అయితే ఈమద్యం విదేశాలకు పంపిణి చేసు సరకుగా పేర్కొంటూ తమ సరకును వెంటనే సర్కారు నుంచి విడిపించాలని యుబి కంపెనీ శుక్రవారం రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వంపైన కేసు పెట్టింది. ఈ కంపెనీ ఎండి విదేశీయుడు అయినందువలన అతడిపై సర్కారు అడ్డగోలుగా ఫిర్యాదు దాఖలు చేసిందని కంపెనీ నిర్వాహకులు ఆరోపించారు. ఎన్నికలు ముగిసిపోవటంతో సర్కారు స్వాధీనం చేసుకున్న బీర్ సరుకును వెంటనే తమకు ఇప్పించాలని బాధితులు కోర్టుకు మనవి చేశారు. సర్కారు తీసుకున్న చర్యల వలన తమ కంపెనీకు ఎనిమిది కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కంపెనీ బాధ్యులు పేర్కొన్నారు.

# యువకుడిపైన లైంగిక దౌర్జన్యం

## - సూరజ్ రేవణ్ణకు హాసన్‌లో స్థల మహాజరు

**హాసన్,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

యువకుడిపైన లైంగిక దౌర్జన్యం రెండు కేసులకు సంబంధించి హాసన్‌జిల్లా మాజీ మంత్రి హొళెనరసీపుర జెడిఎస్ ఎంఎల్ఎ హెచ్‌డి. రేవణ్ణ పెద్ద కుమారుడు ఎంఎల్సీ సూరజ్ రేవణ్ణకు సిఐడి పోలీసులు శుక్రవారం హొళెనరసీపురలో స్థలంలో పంచనామా జరిపారు. బెంగళూరు సెంట్రల్ జైలు నుంచి పోలీసు కస్టడికి తీసుకున్న సిఐడి పోలీసులు సూరజ్ రేవణ్ణను ఇవాళ హొళె నరసీపుర పట్టణానికి తీసుకుని వచ్చి అక్కడి గన్నికడ ఫారంహౌస్‌లో యువకుడిపై లైంగిక దౌర్జన్యం జరిగిన స్థలంలో సాక్ష్యాలను సూరజ్ సమక్షంలో పోలీసులు సేకరించారు. దాదాపు నాలుగు గంటలపాటు గన్నికడ ఫారం హౌసులో సిఐడి పోలీసులు మహాజరు నిర్వహించారు. సోమవారం కోర్టుముందు సూరజ్‌ను హాజరుపరచే అవకాశం ఉంది. ఆలోపు సిఐబి పోలీసులు సాక్ష్యాల సేకరణకు పలుచోట్ల సోదాలు జరుపుతున్నారు.

# కర్ణాటకలో నాలుగు చోట్ల ఎలక్ట్రానిక్స్‌ఉపకరణాల తయారీ క్లస్టర్ల స్థాపనకు ప్రభుత్వం చర్యలు

## - ప్రియాంక్ ఖర్గే

**బెంగళూరు,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**



రాష్ట్ర ఆర్డీపిఆర్ ఐటీబీటి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే.

కర్ణాటకలో నాలుగు చోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల క్లస్టర్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చురుగ్గా చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఆర్డీపిఆర్ ఐటీబీటి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే చెప్పారు. ఆయన శుక్రవారం ఈమేరకు కేంద్రసర్కారుకు చెందిన కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కు ఏర్పాట్లు చేసుకుందని తెలిపారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలుసుకుని మనవి చేశారు. వీటికి కేంద్ర అనుమతులు కావాలని కోరారు. కర్ణాటకలో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ధార్వాడ జిల్లా బేళూరు వద్ద కొత్తూరులో ఇఎంసి ప్రాజెక్టు కోసం భూసేకరణ పనులు ప్రగతిలో ఉన్నాయి. మైసూరు సమీపంలని కొంచనహళ్లి వద్ద ఇసిఎం క్లస్టర్‌ను అభివృద్ధి చేసేందుకు ఎస్టీపిఐ విభాగం అధికారులు గత మేనెల 28న భూసేకరణకు స్థల పరిశీలన జరిపిందని తెలిపారు. కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి సంస్థ ఇక్కడ భూములను కేటాయించనుంది. బెంగళూరు గ్రామీణ జిల్లా అదినారాయణ హొసల్లి గ్రామం వద్ద ఇసిఎం క్లస్టర్ ప్రారంభించేందుకు పరిశ్రమలను పెట్టేందుకు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిగాయని తెలిపారు. తుమకూరు జిల్లా వసంత నరసాపురగ్రామంలోను ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తమ యూనిట్లను ప్రారంభించేందుకు కేంద్ర సర్కారుకు మనవి చేశారని గుర్తు చేశారు. ఈ నాలుగు క్లస్టర్లకు కేంద్రం వెంటనే అనుమతులు ఇచ్చి తగిన సాయం అందించాలని మంత్రి ప్రియాంక్‌ఖర్గే మనవి చేశారు.

# బెంగళూరు ఓకళిపురంలో ప్రింటింగ్ గోడౌనులో అగ్నిప్రమాదం

## - మంటలను అదుపుచేసిన అగ్నిమాపకశాఖ సిబ్బంది

**బెంగళూరు,జూన్28,ప్రభాతవార్త ప్రతినిది**

బెంగళూరు సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఒకళిపురంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక ప్రింటింగ్ కాపీయింగ్ గోడౌనులో విద్యుత్‌షార్టు సర్క్యూట్ వలన మంటలు లేచి పెద్ద మొత్తంలో ప్రింటింగ్ కాగితం ఇతర రంగులు కాలిపోయాయి. అగ్ని ప్రమాదం సంభవించిన సమాచారం అందగానే శేషాద్రిరోడ్డులోని అగ్నిమాపక సిబ్బంది నాలుగు వాహనాలతో స్థలానికి వెళ్లి మంటలను అదుపులోనికి తెచ్చారు. ఈప్రమాదంలో ప్రాణనష్టం ఏదీ సంభవించలేదు. శ్రీరాంపురం పోలీసులు ఈమేరకు కేసు నమోదు చేసుకున్నారు.

# వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నిధుల మళ్లింపు సిఎం రాజీనామా కోసం బిజెపి ఆందోళన



చిత్రదుర్గలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న బిజెపి అధ్యక్షుడు విజయేంద్ర

**చిత్రదుర్గ,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నుంచి 187కోట్ల రూపాయల నిధుల మళ్లింపు కేసుకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా కోరుతూ బిజెపి పార్టీ శుక్రవారం కర్ణాటకలో వివిధ జిల్లాల్లో నిరసన ఆందోళనలు నిర్వహించింది. చిత్రదుర్గలో జరిగిన నిరసన ప్రదర్శనలో బిజెపి అధ్యక్షుడు బివై. విజయేంద్ర పాల్గొన్నారు. అక్కడి ఒనకె ఓబవ్వ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసన రపదర్శనలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా సిఎం రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ నినాదాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన సభలో పార్టీ అధ్యక్షుడు బివై. విజయేంద్ర మాట్లాడారు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు బెంగళూరులోని వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నుంచి పెద్ద మొత్తంలో నిధులను తెలంగాణ హైదరాబాదులోని డొల్లకంపెనీలకు బినామీ ఖాతాలకు తరలించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానంకునిధులు సమకూర్చేందుకు కర్ణాటక సర్కారు కుట్రపన్నిందని ఆరోపించారు. ఈ కేసులో మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారు. ఈకేసును కొనసాగించేందుకు సిబిఐకు అప్పగించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కనుసన్నల్లోనే వాల్మీకి సంస్థ నుంచి నిధులు చేతులు మారాయి. నిధుల అక్రమ బదిలీల్లో ముఖ్యమంత్రి పాత్ర కూడా ఉందని ఆరోపించారు. సిద్దరామయ్య వెంటనే రాజీనామా చేయాలని విజయేంద్ర డిమాండ్ చేశారు. సిఎం రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదని విజయేంద్ర చెప్పారు. కాగా మైసూరు, తుమకూరు, మంగళూరు, బళ్లారి, శివమొగ్గ జిల్లాల్లో ఇవాళ బిజెపి ఆందోళనలు కొనసాగాయి.

# బస్సులో ప్రయాణీకుడు వదిలివెళ్లిన నగలబ్యాగును తిరిగి అప్పగించిన ఆర్టీసి సిబ్బంది

**కొప్పళ్,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

కొప్పళ్ ఆర్టీసి చెందిన ఒక బస్సులో దినేష్ అనే ప్రయాణీకుడు వదిలివేసి వెళ్లిన 15లక్షల రూపాయల బంగారు నగల బ్యాగును అదే బస్సు సిబ్బంది కొప్పళ్ డిపోమేనేజరుకు సమర్పించి తమ నిజాయితీని చాటుకున్నారు. ఈ సంఘటన గురించి బాధితుడు కొప్పళ్ బస్టాండ్‌లో ఆర్టీసి అధికారులకు ఫిర్యాదు చేయగా సదరు ప్రయాణించిన బస్సు వివరాలను సేకరించి ఎంక్వయిరీ చేయటంతో బస్సు కండక్టర్ సంగనగౌడ పాటిల్ తమ బస్సులో ప్రయాణీకుడు వదిలివెళ్లిన నగల బ్యాగును నగల సమేతంగా అందించారు. డిపో మేనేజర్ ఆర్టీసి సిబ్బంది నిజాయితీను మెచ్చుకుని అభినందించారు.

# బెంగళూరులో విస్తరిస్తున్న డెంగ్యూ జ్వరాలు

## - బిబిఎంపి నుంచి స్వచ్ఛతా అభియాన్

**బెంగళూరు,జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలో వివిధ వార్డుల్లో డెంగ్యూ జ్వరాలు విస్తరిస్తున్న నేపధ్యంలో శుక్రవారం బెంగళూరు మహానగర పాలికె ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలసి సంయుక్తంగా ఇంటింటి సర్వేలు ప్రారంభించారు. ఇంటి సర్వేలు చేసే సమయంలో అక్కడి చుట్టుపక్కల ప్రాంతాల్లో నీరునిల్వఉండే గుంతలు మురుగునీటి కుంటలను బాగు చేయించే పనులను పాలికె సిబ్బందికి అప్పగిస్తున్నారు. బెంగళూరు నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచి నీరు నిల్వ ఉండే చోట్ల దోమల సంహారానికి పాలికె ఆరోగ్య సిబ్బంది అత్యవసర పనులు చేపడుతున్నారు. నగరంలో ఇటీవల 1500పైగా డెంద్యూ జ్వరాల బాధితుల కేసులు వెలుగులోనికి రావటంతో పాలికె ఆరోగ్యశాఖ అధికారులు మేల్కొని నివారణ చర్యలకు నడుం బిగించారు. నగరంలోని ఎనిమిది పాలికె జోన్లలో అన్ని వార్డుల్లోను ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి డెంగ్యూ బాధితులను వివరాలను సేకరిస్తున్నారు. డెంగ్యూ జ్వర బాధితులకు చికిత్స చేయించేందుకు మహానగర పాలికె ఒక వార్‌రూం తెరచి అన్నివార్డుల్లోని ఆరోగ్యశాఖ ఆసుపత్రులను సమన్వయం చేస్తోంది.

# ఒక్కలిగ సముదాయం స్వామిజి డిమాండ్‌కు పోటీగా లింగాయత స్వామిజి సిఎం నియామకానికి డిమాండ్

**చిక్కోడి (బెళగావి జిల్లా ),జూన్28,ప్రభాతవార్త ప్రతినిధి**

నిరుడు విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని సపోర్టు చేసిన ఒక్కలిగ సముదాయానికి ఈసారి సిఎం సీటు వదిలిపెట్టాలని ఒక్కలిగ స్వామీజి డిమాండ్ చేసిన నేపధ్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం మఠం వీరశైవ లింగాయత మఠం జగద్గురువు చెన్న సిద్దరామేశ్వర పండిత శివారాధ్యస్వామీజి తమ సముదాయం ఒక సిఎం పదవీని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయన ఇవాళ బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగిన వీరశైవ లింగాయత సమావేశంలో పాల్గొని ఈమేరకు సిఎం సిద్దరామయ్యకు మనవి చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో లింగాయత సమాజం కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. ఈ సముదానికి చెందిన మంత్రుల ఈశ్వరఖండ్రే, ఎంబి. పాటిల్, లేదా ఎస్ఎస్. మల్లికార్జున్‌ల్లో ఒకరికి సిఎం పదవీ కట్టబెట్టాలని మనవి చేశారు. కాగా మఠాలస్వాములు ఇలాసర్కారులోని ముఖ్యస్తుడిని మార్చాలంటూ డిమాండ్‌చేయటం సబబుగాలేదని వ్యవసాయశాఖ మంత్రి ఎన్. చెలువ రాయస్వామి చెప్పారు. వివిధ మఠాల స్వాములు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొని ప్రజల బాగుకోసం పనిచేయాలే తప్పా సర్కారు యంత్రాంగం పనితీరులో జోక్యం చేసుకోకూడదని మనవి చేశారు. కర్ణాటకకు ఎవరు ముఖ్యమంత్రిగా ఉండాలనేది కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇది పూర్తిగా పార్టీ అంతర్గత వ్యవహారం అని చెప్పారు. వాటిలోకి మఠాధిపతులు జోక్యం చేసుకోకూడదని కోరారు.

# దళిత మహిళ భూమిని కబ్జాదారుల నుండి కాపాడండి

## -జనచైతన్య వేదిక అధ్యక్షుడు డిమాండ్



భూమిని సందర్శించిన చైతన్యవేదిక నాయకులు

**అమరాపురం, జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని హేమావతి గ్రామపంచాయతీ కెంకెర గ్రామానికి చెందిన గంగమ్మ, హనుమంతు దంపతులకు హేమావతి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 29-2లో 4.42 ఎకరాల వ్యవసాయభూమి వుంది. వీరికి సంతానం లేకపోవడం వల్ల ఆమె చెల్లెలి కుమార్తె అయిన కెంకెర లలితమ్మకు శాశ్వత వీలునామా ద్వారా తమ హక్కు అనుభవం గల సర్వే నెంబర్ 29-2లో గల 4.42 ఎకరాల వ్యవసాయ భూమిని 2017లో శాశ్వత వీలునామా రాసినారు. అయితే ఈ భూమి మెయిన్‌రోడ్డుకు దగ్గరగా వుండి వ్యవసాయానికి అనువుగా వున్నందున చుట్టుపక్కల గల అగ్రకులాల రైతుల కన్ను పడి ఎలాగైనా ఈ భూమిని కాజేయాలని ప్రయత్నించినట్లు బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ బాధితురాలు లలితమ్మలు ఆరోపించారు. తక్షణం అధికారులు నిరుపేద దళిత మహిళ భూమిని రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. శాశ్వత వీలునామా ద్వారా సంక్రమించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయలేదని వారు పేర్కొన్నారు. ఆమెకు చెందాల్సిన భూమిని పక్క సర్వే నెంబర్‌లో గిరీష్ అనే వ్యక్తి ఆక్రమించుకోవాలని ట్రాక్టర్‌తో దున్నించడం జరిగిందని ఈ విషయం తెలుసుకున్న బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ, వారి బృందం లలితమ్మ వ్యవసాయ భూమిని సందర్శించి ఆమెకు అండగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో బహుజన చైతన్యవేదిక రాష్ట్ర నాయకులు బీచగానిపల్లి రామాంజినప్ప, చల్లాపల్లి ఈశ్వర్, రంగేపల్లి కదిరప్ప, పైడేటి రాందాస్, రామకృష్ణ, గంగాధరప్ప, మూర్తి, తదితరులు పాల్గొన్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ గిరియప్పలను వివరణ కోరగా కింకిర గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 29-2లో గల 4.42 ఎకరాల భూమి లలితమ్మకు చెందినదిగా వివరాలను సేకరించడంతో పాటు స్థానిక సర్వేయర్‌తో పాటు గ్రామ రెవెన్యూ అధికారి గిరీష్‌లు పొలాన్ని సందర్శించడంతో పాటు రికార్డులను కూడా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపి న్యాయం చేస్తామని వారు పేర్కొన్నారు.

# విద్యాప్రవేశము స్టూడెండ్స్ కిట్స్ పింపిణీ పై టీచర్లకు శిక్షణ



విద్యాప్రవేశం పై టీచర్లకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

**కొత్తచెరువు జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి జయచంద్ర విద్యాప్రసాద్ విద్యాప్రవేశము మరియు స్టూడెంట్ కిట్ పంపిణీ గురించి వివరించడం జరిగింది విద్యాప్రవేశు కార్యక్రమంలో భాగంగా గత ఐదు సంవత్సరాల పాఠశాల ఎన్రోల్మెంట్ వివరాలను పరిశీలించుకుని ఎన్రోల్మెంట్ పురుగుదలకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించడం జరుగుతుంది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడానికి చర్యలు తీసుకొవాల్సిందిగా తెలియజేశారు. పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ వివరాలు రిక్వైర్మెంట్ గురించి చర్చించడం జరిగింది.

# ప్రైవేటు పాఠశాల పుస్తకాల గోదాము సీజ్

**గుంతకల్లు, జూన్ 28 ప్రభాతవార్త**

పట్టణంలోని నారాయణ కార్పోరేట్ పాఠశాలవారు అక్రమంగా నిల్వ వుంచిన పుస్తకాల గోదామును శుక్రవారం సాయంత్రం సీజ్ చేసినట్లు ఎంఇఒ మస్తాన్‌రావు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన గోదామును పరిశీలించారు. పుస్తకాలను అక్రమంగా నిల్వ వుంచి అధిక ధరకు పుస్తకాలు విక్రయిస్తున్నారని తెలుసుకుని గోదామును సీజ్ చేశారు. పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఇఒ హెచ్చరించారు.




పుస్తకాల గోదామును సీజ్ చేస్తున్న ◄ ఎంఇఒ

# ఎంఈఓ 2 లకు సమాన హోదా, అధికారాలు కల్పించాలి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎంఈఓ సంఘం నాయకులు.

**పుట్టపర్తి రూరల్ జూన్ 28 ప్రభాతవార్త**

ఎంఈఓ 1 లాగే ఎంఈఓ 2 లకు సైతం సమాన హోదా అధికారులను కల్పించాలని శ్రీసత్యసాయి జిల్లా ఎంఈఓ 2 ల సంఘం అధ్యక్షులు బొల్లె ప్రసాద్ మంత్రికి విన్నవించారు. వారు శుక్రవారం పెనుకొండలో రాష్ట్ర బిసి సంక్షేమ మరియు చేనేత శాఖ మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లాలోని ఎంఈఓ లసమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వీటిని ఆమె స్పందించి ఈ సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తామని ఎంఈఓల రెండు ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రభుత్వం మీకోసం పనిచేస్తుందని మీ సమస్యలు ఎలాంటివైనా వాటిని చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బల్లె ప్రసాద్ కార్యదర్శి రవిచంద్ర ట్రెజరర్ గోపాల్ సుధాకర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై పోలీసులు అవగాహన పెంచుకోవాలి



కొత్తచట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐటి కోర్ టీం సుదర్శన్‌రెడ్డి

**పుట్టపర్తి రూరల్ జూన్ 28 ప్రభాతవార్త**

జులై 1వ తేది నుండి నూతన చట్టాలు అమలులోకి రానున్న నేపధ్యంలో ప్రతి పోలీస్ అధికారి సిబ్బంఇ అవగాహన పెంచుకోవాలని వాటిపై పూర్తిగా పట్టు సాధించే విధంగా చేడాలని అదనపు ఎస్పీ ఎన్ విష్ణు తెలిపారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులకు నేతన



హజరైన పోలీస్ అధికారులు

చట్టాలపై పుట్టపర్తి ఐటి కోర్ట్ టీంతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యలయంలో కాన్ఫరెన్స్ హాల్లో పుట్టపర్తి సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు సిబ్బందికి నూతన చట్టాలపై అదనపు ఎస్పి విష్ణు అవగాహనా కార్యక్రమం శిక్షణ నిర్వహించారు. జులై 1వ తేదీ నుండి కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించి కొత్త పాత చట్టాలలో మార్పులు చేర్పులను క్షుణ్ణంగా వివరించి వారికున్న సందేహాలన్ని నవృత్తి చేశారు. కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకోని బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి అరెస్ట్ వాంగ్మూలం తదితర వంటి వాటిపై నమోదు నందు పాటించవలసిన జాగ్రత్తలు చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, కేసుల ట్రయల్ సమయంలో దర్యాప్తు అధికారుల శిక్షల శాతం పెరిగే విధంగా వ్యవహరించవలసిన తీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెళకువలు గురించి వివరించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు డిఎస్పీ వాసుదేవన్, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఐటికోర్ టీం సుదర్శన్‌రెడ్డి, సిఐలు ఎస్సైలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడకండి అండగా ఉంటా

## - కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి



బోరు బావిని పరిశీలిస్తున్న కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి

**బుక్కపట్నం జూన్ 28 ప్రభాతవార్త**

శ్రీసత్యసాయిజిల్లా పుట్టపర్తి నియోజకవర్గం బుక్కపట్నం మండలం కోత్తకోట గ్రామానికి చెందిన రైతు రాంపురం ఆంజనేయులు వ్యవసాయ క్షేత్రంలో గల బోరుని ఆదే గ్రామానికి చెందిన కొందరు టిడిపి వారు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకుని వారి గ్రామానికి వెళ్లి ఆ రైతుని పరామర్శిచి 10 వేల రూపాయలు ఆర్దిక సహాయం అందజేసి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాను అని ఆయన భరోసా ఇచ్చారు. గెలుపు ఓటములు సహజం అని గ్రామల్లో గొడవలు ఉండాలని అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు.

# నేడే కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

**పుట్టపర్తి రూరల్ జూన్ 28 ప్రభాతవార్త**

నేడు పుట్టపర్తి పురపాలసంఘం సర్వ సభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఛైర్మెన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరుగుతుందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు అందరూ హజరు కావాలని తెలియజేశారు.

